సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం, 11, మార్చి, 2023



జనరిక్..సేల్స్‌లో పీక్

ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారం కారణంగా జనరిక్ మందుల వాడకం బాగా పెరిగింది. ప్రభుత్వం ఆధ్వర్యంలో. ప్రైవేట్‌గానూ జనరిక్ మెడికల్ షాపులను ఏర్పాటు చేస్తున్నారు. -IIలో..



కుక్కల దాడిలో జింక మృతి

రామసముద్రం మండలం బైరాజువల్లె గ్రామ సమీపంలో శుక్రవారం జింక పిల్లపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందింది. -IIలో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.220
రెండోరకం	రూ.90	రూ.168

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 179 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	525	586
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 551.73 కిలోలు



దస్తూరి..మార్కుల సిరి


- చక్కని రాత.. మారుస్తుంది భవిత
- సాధన చేయాలంటున్న నిపుణులు



మదనపల్లె సిటీ: ఇంటర్, పదో తరగతి పరీక్షల సమయం దగ్గరపడుతోంది. ఇప్పటి వరకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా సబ్జెక్టులను మాత్రమే చదువుతూ ముందుకు వెళ్తున్నారు. చదువుతోపాటు దస్తూరిపైనా దృష్టి సారిస్తే చక్కటి మార్కులు మీ సొంతమంటున్నారు నిపుణులు. అక్షర దోషాలు, గజిబిజి చేతిరాత వల్ల ఒకటి,రెండు మార్కులు కోల్పోయే అవకాశం ఉంది.సమాధాన పత్రాన్ని దిద్దే ఉపాధ్యాయుడికి మంచి దస్తూరి కనిపిస్తే ఆ ప్రభావం ఆయన వేసే మార్కులపై సానుకూలంగా ఉంటుంది. ఇంటర్ పరీక్షలు మార్చి 15 నుంచి, పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్నాయి. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 11 పేపర్లను కరోనా కారణంగా గత ఏడాది ఏడు పేపర్లకు కుదించగా ఈ ఏడాది వాటిని ఆరు పేపర్లు చేశారు. బిట్ పేపరు లేకుండా మొత్తం ప్రశ్నలకు జావాబులు రాయాల్సి ఉంది. ఈ క్రమంలో పరీక్షల్లో చక్కటి దస్తూరితో రాస్తే మంచి మార్కులు అందుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. జవాబు సూటిగా, అక్షరాలు పొందికగా ఉంటే పత్రాలను మూల్యాంకనం చేసే ఉపాధ్యాయులు మంచి మార్కులు వేసే అవకాశం ఉంటుంది. ప్రతి రోజూ కొద్ది సేపు రాతపై సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు. పెన్‌టిప్‌ను దూరంగా పట్టుకుని రాస్తే అక్షరాలు గుండ్రంగా వచ్చే అవకాశం ఉంటుంది.

వచ్చిన ప్రశ్నకే మొదటి ప్రాధాన్యం

ప్రశ్నపత్రంలో మనకు వచ్చిన ప్రశ్నలు చాలానే ఉంటాయి. కాని వాటిలో బాగా వచ్చిన ప్రశ్నల జవాబులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆత్మవిశ్వాసంతో రాసే మొదటి జవాబు మిగతా ప్రశ్నలకు జవాబు రాసేందుకు తోడ్పాటు అందిస్తుంది.




విద్యార్థులకు చేతిరాత పై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

పేజీకి 20 లైన్లు తగ్గకుండా...

చాలా మంది విద్యార్థులు జవాబు పత్రాలు రాసేటప్పుడు పేజీకి 15 లైన్లు రాస్తే మరికొందరు ఏకంగా 25 లైన్లు రాస్తుంటారు. జవాబు పత్రాలు దిద్దే వారికి అక్షరాలు పెద్దవిగా ఉంటే పేజీని నింపే ధోరణి అని భావిస్తారు. మరీ చిన్నవిగా ఉంటే మార్కులు తక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. పేజీకి 20 లైన్లు ఉండేలా చూసుకుంటే మంచిది.

పేరా గ్రాఫ్‌కు అవే అందం..

పెద్ద ప్రశ్నలకు జవాబులు రాసేటప్పుడు పేరాగ్రాఫ్‌లుగా రాస్తుంటాం. అయితే పేరాగ్రాఫ్ ప్రారంభించే ముందు రెండు పదాలు సరిపడా ఖాళీని వదిలి రాయాలి. ఫుల్‌స్టాప్‌లు, కామాలు, పేరాగ్రాఫ్‌కు అందాన్నిస్తాయి.వాటిని ఎక్కడ వాడాలో తెలుసుకుని రాయాలి.



పదాలు పైకి కిందికి రాయకూడదు

పరీక్షలు రాసేటప్పుడు జవాబుపత్రంలో పదాలు ఒక గీతపై రాస్తున్నట్లుగా వరుస క్రమంలో ఉండాలి. అలైన్‌మెంట్‌ను సరి చేసుకుంటే వ్యాక్యాలు రాయాలి. పదాలు పైకి కిందకు ఉండకూడదు. అక్షరాలు రాసేటప్పుడు సరైన వరుసలో రాస్తే అందంగా అర్థవంతంగా ఉంటుంది.

చేతిరాతపై పట్టు సాధించాలి



పదతరగతిలో ఈ ఏడాది మొత్తం అన్నీ ప్రశ్నలే.బిట్లు ఉండవు. దాంతో రాతను ముందు నుంచి సాధన చేయాలి. ప్రశ్నలకు తగిన సమాధాన్ని ఒక క్రమపద్ధతిలో స్పష్టంగా రాయాలి. సమాధాన పత్రం దిద్దే ఉపాధ్యాయుడు ఆ పత్రం అందంగా కనిపించడం వల్ల మంచి మార్కులు వేసే అవకాశం ఉంటుంది. పాఠ్యాంశాల పునశ్చరణతో పాటు గుండ్రని చేతిరాతపై పట్టు సాధించాలి. -ఏసుపాదం, చేతిరాత నిపుణులు,మదనపల్లె

సాధనతోనే మార్పు



పరీక్షల్లో అందమైన చేతిరాత ఎంతో కీలకం. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు జవాబులు రాసే సమయంలో తమ దస్తూరి మెరుగు పరుచుకోవడంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. వేగంగా,గుండ్రంగా,అందంగా రాయడమనేది పరీక్షల్లో విజయానికి సోపానం. అక్షర దోషాలు లేకుండా రాయాలి. పదాలు, వ్యాకాలు వద్ద తగిన ఖాళీ ఉండేలా చూసుకోవాలి. నిరంతరం చదివింది మననం చేసుకుంటూ క్రియేటివిటీతో రాస్తూ సాధన చేయాలి. దీంతో మంచి దస్తూరితో పాటు వేగంగా రాసే విధానం కూడా అలవాటవుతుంది. -పి.మహమ్మద్‌ఖాన్, ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్,మదనపల్లె

సాంకేతిక విద్య..ఉజ్వల భవిత

- పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు..పాలిసెట్
- పది విద్యార్థులకు చక్కని అవకాశం
- దరఖాస్తు పక్రియ ప్రారంభం

కడప ఎడ్యుకేషన్: పదోతరగతితోనే ఉన్నత సాంకేతిక విద్యకు పునాది వేసే పాలిసెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ ప్రవేశాలు పొందొచ్చు. ఈ ఏడాది పది పరీక్షలు ప్రారంభం కాకుండానే సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులు ముందుగానే నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ అవకాశాన్ని పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు, సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు.

గ్రామీణ విద్యార్థులకు ఉపయుక్తం...

గ్రామీణ పేద విద్యార్థులు ఇంజినీరింగ్ వంటి అత్యున్నత సాంకేతిక విద్య అభ్యసించడం ఖర్చుతో కూడుకుంది. వీరికి తక్కువ ఖర్చుతో ప్రాథమికంగా సాంకేతిక విద్య అందిస్తే దానిని పునాదిగా చేసుకుని భావి జీవితానికి బాటలు వేసుకునే అవకాశం లభిస్తుంది. దీనికి పాలిటెక్నిక్ కోర్సులు వేదికగా నిలుస్తాయి. పాలిసెట్ ద్వారా పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరి సాంకేతిక విజ్ఞానాన్ని సొంతం చేసుకుని సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సులభంగా పొందవచ్చు.

ప్రవేశ పరీక్ష

పాలిసెట్ పరీక్ష రాసేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఈ పరీక్ష 120 మార్కులకు నిర్వహిస్తారు. దరఖాస్తు చేసేకునేందుకు ఏప్రిల్ 30వ తేదీ వరకు గడువు ఉంది. పదో తరగతి సిలబస్ అధారంగా గణితం 50, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కుల చొప్పున ఈ ప్రవేశ పరీక్ష ఉంటుంది. మే 10న పాలిసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు.మే 25న ఫలితాలు వెల్లడిస్తారు ఎంట్రెన్స్ రాసేందుకు ఓసీ, బీసీ వర్గాల విద్యార్థులు రూ. 400, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు రూ. 100 చొప్పున ఫీజు చెల్లించాలి. తగిన ధ్రువీకరణ పత్రాలతో https://polycetap.nic.in/అనే వెబ్‌సైట్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఎన్నో ప్రయోజనాలు...

పాటిటెక్నిక్‌లో ఏ కోర్సు పూర్తి చేసినా ఉద్యోగం, ఉపాధి సులభంగా దొరుకుతాయి. పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇటీవల ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులు వచ్చి విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కోర్సు చేయడానికి మూడు సంవత్సరాలకు తక్కువ ఖర్చుతో కోర్సును పూర్తి చేయవచ్చు. తర్వాత ఇంజినీరింగ్‌లో సెకండియర్‌లో చేరవచ్చు.లేకపోతే ఉద్యోగ ప్రయత్నాలు చేసుకుని ఉద్యోగంలో చేరవచ్చు.



కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30
ప్రవేశ పరీక్ష : మే 10
ఫలితాలు వెల్లడి: మే 25
కౌన్సెలింగ్ : జూన్ 4వ వారం


తక్కువ సమయంలో...



పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ చేస్తే చిన్న వయసులోనే ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఉన్నత విద్యతోపాటు స్వయం ఉపాధికి తోడ్పడుతుంది, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 17వ తేదీ నుంచి విద్యార్థులకు ఉచితంగా కోచింగ్‌ను నిర్వహించనున్నాం. మెటీరియల్‌ను అందచేస్తాం. అలాగే వీరికి ప్రతి రోజు పరీక్ష నిర్వహించి పరీక్షలకు సిద్ధం చేస్తాం. - జ్యోతి, కో-ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, కడప

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

- ఏపీఎస్‌ఆర్టీసీ వైఎస్సార్ జిల్లా ప్రజారవాణా అధికారి గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్ : ప్రమాదాల నివారణకు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండటంతో పాటు, జాగ్రత్తలు పాటించాలని ఏపీఎస్‌ఆర్టీసీ వైఎస్సార్ జిల్లా ప్రజారవాణా అధికారి గోపాల్ రెడ్డి సూచించారు. కడప రీజియన్ పరిధిలో తక్కువ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లకు శుక్రవారం కడపలో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండు ప్రాంతాల్లో వేగంగా బస్సులు నడపకూడదని, హారన్ మోత లేకుండా చూడాలని, కండక్టర్ లేకుండా రివర్స్ చేయకూడదని సూచించారు. కడప డిపో మేనేజర్ ఢిల్లేశ్వరరావు మాట్లాడుతూ అనవసరమైన ఓవర్‌టేక్‌లు సరికాదన్నారు. ఇంధనం పొదుపు చేసేందుకు పంచసూత్రాలను వివరించారు. కేఎంపీఎల్ పెరుగుదలకు ప్రతి డ్రైవర్ శక్తిమేర కృషిచేయాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాసులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌డీఐలు కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, వివిధ డిపోలకు చెందిన డ్రైవర్లు పాల్గొన్నారు.

సేవలు అద్భుతం.. ఆదరణ అపూర్వం

- పేదలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులు
- గతం కంటే పెరిగిన ప్రసవాలు
- నిరంతరం అందుబాటులో వైద్యసేవలు

బి.కొత్తకోట: అన్నమయ్యజిల్లాలో సర్కారు వైద్యానికి ఆదరణ లభిస్తోంది. గతానికి భిన్నంగా ప్రభుత్వం మెరుగైన సేవలు అందిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రులు సుఖప్రసవాలకు, శస్త్రచికిత్సలకు కేంద్రాలుగా మారిపోతున్నాయి. వందల సంఖ్యలో మందులు, రోగ నిర్ధారణ పరీక్షలు, ఎక్స్‌రే, ఈసీజీ లాంటి పరీక్షల నిర్వహణ సాగుతూ పేదలకు అండగా నిలుస్తున్నాయి. నిపుణులైన వైద్యులను ప్రభుత్వం నియమించి సేవలు అందిస్తోంది. దీనికి బి.కొత్తకోట సీహెచ్‌సీ చక్కటి ఉదాహరణ. గత ప్రభుత్వంలో మందులు, రక్త పరీక్షలకే పరిమితమైన సీహెచ్‌సీ ఇప్పుడు ఆపరేషన్లు చేసేస్థాయికి ఎదిగింది. ఇలాంటి పరిస్థితులు జిల్లాలోని 11 వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. జిల్లాలో వైద్య విధాన పరిషత్ పరిధిలో మదనపల్లెలో జిల్లా ఆస్పత్రి, పీలేరు, రాయచోటి, రాజంపేటల్లో ప్రాంతీయ ఆస్పత్రులు, వాయల్పాడు, మహల్, కలికిరి, తంబళ్లపల్లె, బి.కొత్తకోట, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరుల్లో సామాజిక ఆరోగ్య కేంద్రాలు నడుస్తున్నాయి.

నెలలో 609 ప్రసవాలు

వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులకు వస్తున్న గర్భిణుల సంఖ్య పెరిగింది. ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి ప్రసవం వరకు అన్ని వైద్యసేవలు, మందులు ఉచితంగా ఇవ్వడమేకాక తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో తల్లీబిడ్డలను స్వగ్రామాలకు ఉచితంగా చేరుస్తారు. దీంతో జిల్లాలోని 11 ఆస్పత్రుల్లో ఒక్కనెలలో అంటే జనవరి 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 25 వరకు 609 ప్రసవాలు జరిగాయి. ఇందులో అత్యధికంగా మదనపల్లెలో 267 ప్రసవాలు జరిగాయి. సుఖప్రసవాలు జరగని పక్షంలో సిజేరియన్ ద్వారా ప్రసవాలు చేయిస్తున్నారు. ప్రసవానంతరం కుటుంబ నియంత్రణకు సంబంధించి మహిళలకు బటన్‌హోల్ ఆపరేషన్లు కూడా చేస్తున్నారు. దీనికోసం 292 రకాల సర్జికల్ మెటీరియల్‌ను ప్రభుత్వం ఆస్పత్రులకు సరఫరా చేస్తోంది. ఈ ప్రసవాల సంఖ్య ప్రభుత్వ వైద్య సేవలకు తార్కాణంగా నిలుస్తోంది.



బి.కొత్తకోట సీహెచ్‌సీలో తొలి సిజేరియన్ ప్రసవ మహిళ జ్యోతితో వైద్యబృందం (ఫైల్)

- రోగులకు వైద్యసేవలు, రోగ నిర్ధారణ విషయంలోనూ పేదలకు వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులు అసరాగా నిలుస్తున్నాయి. జనవరి 26వ తేది నుంచి ఫిబ్రవరి 25 వరకు మొత్తం 1,17,131 మంది రోగులకు అవుట్‌పేషెంట్ల కింద డాక్టర్లు వైద్య సేవలు అందించారు. ఈ ఆస్పత్రుల్లో చేరి వైద్యసేవలు పొందిన రోగులు 9,757 మంది. ఈ సేవల్లో రాయచోటి ఆస్పత్రి 102 శాతం లక్ష్యం సాధించింది. 3,891 మందికి ఎక్స్‌రేలు తీశారు. 1,805 మందికి గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. మిగిలిన యంత్ర పరీక్షలకు సంబంధించి 2,564 మంది సేవలు పొందారు. వ్యాధుల బారిన పడిన 1,15,770 మందికి రక్త పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేశారు. తర్వాత వీరికి వైద్య సేవలు అందించారు.

316 రకాల ఔషధాలు

వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులకు వచ్చే రోగులకు ప్రభుత్వం 361 రకాల మందులను ఉచితంగా అందిస్తోంది. వ్యాధులతో వచ్చే వారికి పరీక్షలు నిర్వహించి సంబంధిత వ్యాధుల నివారణకు టాబ్లెట్‌లు, సిరప్‌లు ఆస్పత్రి ఫార్మసిస్ట్ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్నారు. దీనివల్ల పేదలు ప్రైవేటుగా వైద్య సేవలు, పరీక్షలు నిర్వహించుకుని, టాబ్లెట్‌లు కొనుగోలుకు పెద్ద మొత్తం డబ్బు ఖర్చుచేసే ప్రయాస తప్పింది. ప్రభుత్వం వైద్యం కోసం చేస్తున్న ఖర్చు వృధా కావడంలేదు.

సిజేరియన్‌తో ప్రారంభం

బి.కొత్తకోట సీహెచ్‌సీలో తొలి శస్త్ర చికిత్స గతేడాది అక్టోబర్ ఏడున జరిగింది. నందిశెట్టివీధికి చెందిన జి.జ్యోతి (38) నాలుగోసారి గర్భం దాల్చింది. హైరిస్క్‌గా నిర్ధారించిన వైద్యులు సిజేరియన్ చేయగా మగబిడ్డ పుట్టాడు. తల్లి, బిడ్డలకు మెరుగైన వైద్యసేవలు అందించి ఇంటికి పంపారు. అప్పటినుంచి ఇక్కడ సిజిరియన్లే కాక ఇతరా చిన్న చిన్న శస్త్రచికిత్సలు చేస్తున్నారు. దీంతో రోగులసంఖ్య పెరిగింది.

50 పడకలకు కృషి



బి.కొత్తకోట సీహెచ్‌సీని 50 పడకలస్థాయికి పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఆస్పత్రికి అవసరమైన వైద్యులు, పరికరాలు, ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు పూర్తి చేశారు. వైద్యసేవల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్నాం. –పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే

ఆసుత్రులను నిత్యం పర్యవేక్షిస్తున్నాం



వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో పేదలకు వైద్య సేవలు అందించే విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదు. జిల్లాలోని అస్పత్రులను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. ఎక్కడ ఇబ్బందులున్నా తక్షణమే పరిష్కార చర్యలు తీసుకుంటున్నాం. పేదలకు మెరుగైన సేవలు అందించాలన్నదే ప్రభుత్వ ఆశయం. -పి.చంద్రశేఖర్, జిల్లా వైద్యశాలల సేవల సమన్వయ అధికారి

నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

అనంతపురం సిటీ: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటన జరిగినా మీరిచ్చే నివేదిక ఆధారంగానే ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా వ్యవహరించాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ సమావేశ భవన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సూక్ష్మ పరిశీలకులకు శుక్రవారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈ నెల 13న పోలింగ్ ప్రక్రియ జరిగేలా చూడాలని సూచించారు. పోలింగ్ నిర్వహణలో లోపాలు లేదా సమస్యలు తమ దృష్టికి వస్తే వెంటనే ప్రిసైడింగ్ అధికారితో చర్చించి అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ రోజున ఉదయం 7 గంటలకే తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జిల్లాలో ఈ నెల 13న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ రాజకీయ పార్టీలకు చెందిన నేతలతో అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలోకి అనుమతించేందుకు పోలింగ్ ఏజెంట్లు తప్పనిసరిగా ఒరిజినల్ గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని సూచించారు. అన్ని పోలింగ్‌స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ నిర్వహిస్తారని ఆయన అన్నారు. ఎన్నికల ప్రక్రియలో పార్టీలు సంయమనంతో వ్యవహరించాలని, ఎన్నికల సంఘం సూచనలను పాటించాలని ఆయన కోరారు. ఎన్నికల కోసం భారత ఎన్నికల సంఘం పంపిన జంబో బ్యాలెట్ బాక్సుల గురించి పార్టీలకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి జాయింట్ కలెక్టర్ తమీమ్‌అన్సారియా, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురు రాజకీయ నేతలు హాజరయ్యారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

సెక్టోరల్ అధికారులు కీలకపాత్ర పోషించాలి

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సెక్టోరల్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సెక్టోరల్ అధికారులతో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ ఈ ఎన్నికలలో రీ పోలింగ్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తగా పోలింగ్ సరళి జరిగేటట్టు చూడాలన్నారు. ఇందుకు సంబంధించి సెక్టోరల్ అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు.

సైలెంట్ పీరియడ్‌లో ముందస్తు అనుమతులు తప్పనిసరి

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల సైలెంట్ పీరియడ్‌లో రాజకీయ ప్రకటనలకు ఎన్నికల అధికారుల అనుమతులు తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. పోలింగ్ ముందస్తు రోజు, పోలింగ్ రోజు(పత్రికల్లో ప్రచురించేరోజు) పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలలో ప్రకటనలు ఇవ్వదలచిన వారు సదరు ప్రకటన, దరఖాస్తుపై పోటీ చేసే అభ్యర్థి సంతకం చేసి కలెక్టరేట్‌లోని ఎంసీఎంసీ కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. కమిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు.

క్లుప్తంగా

'పోలీసులు నన్ను కొట్టారు'


గాయపడిన అవినాష్‌రెడ్డి

రాజంపేట : రాజంపేట బైపాస్‌రహదారిలో గురువారం రాత్రి మన్నూరు పోలీసులు తనను అకారణంగా కొట్టారంటూ బాధితుడు అవినాష్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. తాను రిమ్స్‌లో చికిత్స పొందుతున్నట్లు వివరించారు. రాజంపేట నుంచి నందలూరుకు వస్తుంటే మన్నూరుకు చెందిన ఇద్దరు పోలీసులు ఆపి తన బైకు కావాలని కోరారని, మద్యం తెచ్చి ఇవ్వాలన్నారు. అందుకు తాను నిరాకరించినట్లు తెలిపారు. దీంతో తనను దారుణంగా కొట్టారన్నారు. ఈ విషయంపై రాజంపేట రూరల్ సీఐ పుల్లయ్యను వివరణ కోరగా అవినాష్‌రెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. బైపాస్‌లో బహిరంగప్రదేశంలో మద్యం సేవించి ఇష్టానుసారంగా ప్రవర్తించాడన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి


కుక్కలదాడిలో మృతి చెందిన జింక

రామసముద్రం : మండలంలోని కాప్పల్లె పంచాయతీ బైరాజుపల్లె గ్రామ సమీపంలో శుక్రవారం మేత కోసం పంట పొలాల్లోకి వచ్చిన జింక పిల్లపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. సమీపంలోని అడ్డకొండ పొలాల్లో జింక కుక్కల కంట పడింది. దీంతో కుక్కలు దానిపై దాడి చేయడంతో స్థానికులు గమనించి రక్షించారు. అయితే అప్పటికే జింక శరీరంపై తీవ్ర గాయాలు కావడంతో అటవీశాఖాధికారులకు సమాచారం అందించారు. పశువైద్య అంబులెన్స్ అధికారులు జింకకు చికిత్స చేస్తుండగానే మృతి చెందింది. అటవీశాఖ సిబ్బంది శ్రీదేవి సంఘటన స్థలానికి చేరుకుని జింకకు పంచనామా చేయించి కాల్చివేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కుక్కలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అనేక మార్లు విన్నవించినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని తెలిపారు.

సస్పెండైన వీఆర్‌ఏకు 24 వరకు రిమాండ్


పోలీసుల అదుపులో వీఆర్‌ఏ కోలా రమణ

గాలివీడు : అక్రమ వసూళ్ల పర్వంలో సస్పెండైన తాత్కాలిక వీఆర్‌ఏ కోలా రమణకు ఈనెల 24వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ వెంకట శివకుమార్ తెలిపారు. బాధితులు, రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పోలీసులు నిందితున్ని శుక్రవారం లక్కిరెడ్డిపల్లి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కేసులో పూర్తి విచారణ చేసిన అనంతరం రూ. 23 లక్షలు వీఆర్‌ఏ వసూలు చేసినట్లు తేలిందన్నారు. అతని నుంచి రూ. 5 లక్షలు రికవరీ చేశామన్నారు.

జనరిక్.. సేల్స్‌లో పీక్

- పెరుగుతున్న వాడకం
- 40నుంచి 70 శాతం తక్కువ ధరకు మందులు
- పేదలు, మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం



జిల్లా ఆస్పత్రి ఆవరణలోని జనరిక్ మెడికల్ షాపు

ప్రొద్దుటూరు క్రైం : ఏదైనా ఒక వస్తువు తక్కువ ధరకు వస్తుందంటే జనం వాటిని కొనడానికి క్యూ కడతారు. మళ్లీ ఆ వస్తువు ఇంత తక్కువకు దొరుకుతుందో లేదోనని అవసరానికి మించి కొనుగోలు చేస్తారు. అయితే ప్రాణాలను నిలిపే ఔషధాల విషయంలో ప్రజల ఆలోచన ఇందుకు భిన్నంగా ఉంది. తక్కువ ధరకు లభిస్తున్న మందులంటే అవి పని చేస్తాయో లేదో అనుమానం అనేకమందిలో ఉంది. ఇలా తక్కువ ధరలకు లభిస్తున్న జనరిక్ మందుల విషయంలో కొన్నేళ్ల క్రితం వరకు ప్రజల్లో అపోహ ఉండేది. అయితే ఇప్పుడు ప్రజల ఆలోచనల్లోనూ మార్పు వచ్చినట్లు కనిపిస్తుంది. ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారం కారణంగా జనరిక్ మందుల వాడకం బాగా పెరిగింది. ప్రస్తుతం ఆస్పత్రి బిల్లు కంటే మందుల ఖర్చు ఎక్కువ అవుతోంది. దీంతో జ్వరం, జబులు చేసినా పేద, మధ్య తరగతి ప్రజలు వణికిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జనరిక్ మందులు కొంత వరకు ఉపశమనం కలిగిస్తున్నాయి.

పెరిగిన జనరిక్ మందుల షాపులు

గతంతో పోలిస్తే జనరిక్ మెడికల్ షాపుల సంఖ్య జిల్లాలో పెరిగినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వం ఆధ్వర్యంలో, ప్రైవేట్‌గానూ జనరిక్ మెడికల్ షాపులను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 25 జనరిక్ షాపులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కడప రిమ్స్‌లో, ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో ప్రభుత్వ సహకారంతో జనరిక్ దుకాణాలను ఏర్పాటు చేశారు. ఇంకా ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు, కడప, జమ్మలమడుగు తదితర ప్రాంతాల్లో ఈ షాపులు ఉన్నాయి.

సాధారణ మందుల్లాగే పని చేస్తాయి

ధర తక్కువగా ఉండే మందుల మందుల విషయంలో ప్రజలకు అపోహ మరింత ఎక్కువగా ఉంటుంది. అనేక పరిశోధనలు చేస్తే గానీ ఒక మందు మార్కెట్‌లోకి రాదు. ఇందుకోసం ఫార్మా కంపెనీలు రూ. కోట్లలో ఖర్చు పెట్టాల్సి వస్తుంది. ఇందుకు ప్రతిఫలంగా సదరు ఫార్మా కంపెనీకి ఆ మందుపై సుమారు 20 ఏళ్లపాటు పేటెంట్ హక్కులు ఉంటాయి. ఈ విధంగా తయారు చేసిన మందును బ్రాండెడ్ డ్రగ్స్ లేదా స్టాండర్డ్ డ్రగ్స్ అని పిలుస్తారు. ఇతర ఫార్మా కంపెనీలు పేటెంట్ పొందిన కంపెనీ ఫార్ములాను ఉపయోగించి మందులను తయారు చేయడాన్ని తీవ్ర నేరంగా పరిగణిస్తారు. ఆ మందుపై మొదట తయారు చేసిన కంపెనీకే 20 ఏళ్ల పాటు సర్వహక్కులు ఉంటాయి. 20 ఏళ్ల తర్వాత ఇతర కంపెనీలు అదే ఫార్ములాను ఉపయోగించి తయారు చేసిన వాటిని జనరిక్ మందులు అంటారు. ఈ మందులు తయారు చేయడానికి పరిశోధనలు అవసరం ఉండదు. కాబట్టి ఇలాంటి మందులపై మార్కెటింగ్ ఖర్చులు, జీతభత్యాలు, ప్యాకేజీలు, కమీషన్ తదితర ఖర్చులేమీ ఉండవు. అందువల్ల అతి తక్కువ ధరకు విక్రయించడానికి సాధ్యం అవుతుంది. వీటిపై ముద్రించే ఎమ్మార్పీ కంటే తక్కువ ధరకు లభిస్తాయి. తక్కువకు విక్రయిస్తున్నందున నకిలీ మందులనీ, అవి సరిగా పని చేయవని భయపడాల్సిన పని లేదు. బ్రాండెడ్ మందులు తయారీలో పాటిస్తున్న ప్రమాణాలన్నీ జనరిక్ మందుల్లోనూ పాటిస్తారు. కాబట్టి ఈ మందులను నిరభ్యంతరంగా వాడొచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రజలు జనరిక్ మందులకు అలవాటు పడితే ఫార్మా కంపెనీలకు, మెడికల్ షాపులకు నష్టం వస్తుంది. దీంతో బ్రాండెడ్ మందుల్లా జనరిక్ మెడిషన్స్ పని చేయవని కొందరు పనిగట్టుకొని కొందరు వైద్యులు ప్రచారం చేస్తున్నారు.

తక్కువ ధరకు ప్రధాన కంపెనీల మందులు

జనరిక్ షాపుల్లో తక్కువ ధరకే మార్కెట్లో పలు ప్రధాన కంపెనీల మందులను విక్రయిస్తున్నారు. లుపిన్, సిప్లా, ర్యాన్‌బాక్సీ, అల్కెమ్, గ్లెన్‌మార్క్, క్యాడిలా, ఇన్‌టాస్, లీఫార్డ్, బయోకెమ్ తదితర ప్రధాన కంపెనీలకు చెందిన ఔషధాలను అతి తక్కువ రేటుకు అభిస్తున్నాయి. షుగర్, బీపీ, గుండె జబ్బులు, థైరాయిడ్, ఆస్తమా తదితర దీర్ఘకాలిక వ్యాధులు, గ్యాస్ట్రబుల్, జ్వరం, తలనొప్పి మందులను జనరిక్ మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్నారు. కంపెనీకి చెందిన అజిత్రోమైసిన్ 500ఎంజీ రూ.70కి విక్రయించగా జనరిక్ మెడికల్ షాపులో రూ.50 కే లభిస్తుంది. అలాగే మార్టిలుకాస్ట్ టాబ్లెట్ల షీట్ రూ. 132 ఉండగా జనరిక్‌లో 35,రూ. కాల్షియం డీ3 ఎమ్మార్పీ రూ.100 ఉండగా రూ. 30కి, ఆమ్లోడిపైన్ అనే బీపీ మాత్రల ఎమ్మార్పీ రూ.56 ఉంటే రూ. 10కి, పారాసిటమాల్ ఎమ్మార్పీ రూ.30 ఉండగా రూ.20కి, మెట్‌ఫార్మిన్ గ్లైమ్‌ప్రైడ్ మాత్రల ఎమ్మార్పీ రూ. 95 ఉండగా రూ.15కు, పాంటాప్రాజోల్ మాత్రల షీట్ రూ. 118 కాగా రూ. 30కే జనరిక్ మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్నారు. ప్రజలు ఎలాంటి అపోహలు చెందకుండా జనరిక్ మందులను వాడొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

నిరభ్యంతరంగా వాడొచ్చు


జనరిక్ మందులపై అపోహలు పెట్టుకోవద్దు. బ్రాండెడ్ కంపెనీ మందుల్లాగే ఇవి కూడా బాగా పని చేస్తాయి. అన్ని వ్యాధులకు జనరిక్‌లో ఔషధాలు లభిస్తున్నాయి. పేదలు, మధ్య తరగతి ప్రజలకు ఇవి అధిక ధరల భారాన్ని తగ్గిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో జనరిక్ మందుల వాడకం ఎక్కువగా ఉంది. మన ప్రభుత్వం కూడా జనరిక్ మందులను ప్రోత్సహిస్తోంది.

– డాక్టర్ ఆనంద్‌బాబు, మెడికల్ సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి.

జనరిక్ మందులనే వాడుతున్నా


నేను 2015 నుంచి జనరిక్ మందులనే వాడుతున్నా. ఇవి బాగా పని చేస్తున్నాయి. బ్రాండెడ్ మందులు ఎలా పని చేస్తాయో ఇవి కూడా అలానే మన ఆరోగ్యాన్ని కాపాడతాయి. అపోహలు వీడి పేద, మధ్య తరగతి వర్గాలతో పాటు అందరూ వీటిని కొనుగోలు చేయవచ్చు.

– కృపాకర్, యర్రగుంట్ల.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి


శ్రీరాములు (ఫైల్)

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి ప్రధాన రహదారిలో స్థానిక ఓ డాబా సమీపంలో వెనుకవైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీకొని శ్రీరాములు అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ చంద్రమోహన్ సమాచారం మేరకు ముద్దనూరుకు చెందిన శ్రీరాములు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి భోజనానికి అతను నడుచుకుంటూ ఇంటికి వెళుతుండగా తాడిపత్రి వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం అతన్ని వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీరాములు అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డు పక్కన పడి ఇతను చనిపోవడంతో రాత్రి అంతా ఎవరూ గుర్తించలేదు. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చెట్టుపైనుంచి పడి..


మృతుడు కమాల్ సాబ్

కడప అర్బన్ : కడప ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎర్రముక్కపల్లి నుంచి ఎస్వీడిగ్రీ కళాశాలకు వెళ్లే దారిలో న్యాయవాది శివప్రసాద్ రెడ్డికి సంబంధించిన స్థలంలో వేపచెట్లను నరుకుతుండగా గౌస్‌నగర్‌కు చెందిన కమాల్‌సాబ్ (49) కింద పడి మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుని కుమారుడు కమాల్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా.. కమాల్‌సాబ్ శుక్రవారం ఉదయం న్యాయవాది శివప్రసాద్‌రెడ్డి ఇంటి స్థలంలో వేపచెట్లను నరికేందుకు కూలిపనికి వెళ్లాడు. ఆ చెట్టును నరుకుతుండగా కాలుజారి కిందపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతన్ని రిమ్స్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు తెలిపారు.

గనులలో పనులు అడ్డుకున్న గ్రామస్తులు


గనులలోని ఖనిజ రవాణా వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ మంగంపేట గనులలో శుక్రవారం ఖనిజ రవాణాను గ్రామస్తులు, మహిళలు అడ్డుకొన్నారు. ఈ సందర్భంగా పులపుత్తూరు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ కాలుష్య గ్రామాలైన మంగంపేట, కాపుపల్లి, దళితవాడ గ్రామస్తుల తరలింపు జాప్యం కారణంగా ఖనిజ రవాణా వాహనాలను అడ్డుకున్నామని తెలిపారు. ప్రభుత్వం గ్రామాల తరలింపునకు అన్ని రకాలుగా సహకరిస్తుంటే ఏపీఎండీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఐదు నెలలుగా పునరావాసం కోసం మూడు గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. అనంతరం సీపీఓ వెంకటరమణ గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలుపుతామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పులపుత్తూరు సుదర్శన్ రెడ్డి, కోటి, మూడు గ్రామాల ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా వేద విద్య అమలు

- వర్సిటీలో వేద, ఆగమ హెరిటేజ్ కారిడార్ల ఏర్పాటు
- దైవత్వం ఉట్టిపడేలా ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలి
- టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి అలిపిరి : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ–2020 ప్రకారం వేదవిద్యను ప్రణాళికాబద్ధంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో గల కార్యాలయంలో ఈఓ శుక్రవారం వేద వర్సిటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ వేదవర్సిటీలో అడుగడుగునా దైవత్వం ఉట్టిపడేలా ప్రాంగణాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్సిటీ ప్రాంగణంలో వేదిక్ హెరిటేజ్ కారిడార్, ఆగమ, పౌరోహిత్య హెరిటేజ్ కారిడార్లు ఏర్పాటుచేసి ఇందులో వేదాలు, ఆగమాలు, పౌరోహిత్యం తదితర విషయాలపై సమాచారాన్ని ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్సిటీ పచ్చదనం, పరిశుభ్రతతో అలరారే విధంగా అధ్యాపకులు, విద్యార్థులు నడుచుకోవాలని సూచించారు. హాస్టల్లో డిట్టం ప్రకారం తయారు చేసే భోజనం పూర్తి నాణ్యతగా ఉండాలన్నారు. బ్రాడ్ కాస్టింగ్ ద్వారా నిత్యం వేదమంత్రాలు వినిపించేలా వర్సిటీ ప్రాంగణంలో తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. వేదాల రికార్డింగ్ కోసం వేద రికార్డింగ్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న దాదాపు రెండు లక్షల పైచిలుకు రాతప్రతుల స్కానింగ్ పనులను ఎస్వీ మాన్యుస్క్రిప్ట్ ప్రాజెక్ట్ ద్వారా వేగవంతం చేయాలని చెప్పారు. ఈ సమీక్షలో టీటీడీ జేఈఓ సదాభార్గవి, ఉపకులపతి ఆచార్య రాణిసదాశివమూర్తి, రిజిస్ట్రార్ డా.రాధేశ్యామ్, ఈఈ మల్లికార్జున ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప ఎడ్యుకేషన్ : హజ్రత్ ఆయిషా బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. ఈ కళాశాలలో డిప్యూటీ సీఎం తన తండ్రిజ్ఞాపకార్థం రూ. 16 లక్షలతో రెండు తరగతి గదులను నిర్మించారు. ఈ తరగతి గదులను శుక్రవారం ప్రారంభించి కళాశాలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సంస్థ మైనార్టీ బాలికల విద్యకోసం గత 30 సంవత్సరాలుగా పాటుపడుతోందన్నారు. ఈ కళాశాలను 60 మంది బాలికలతో ప్రారంభించారని, నేడు 12 వందల మంది బాలికలు ఇంటర్ విద్యనభ్యసించడం ఆనందదాయకంగా ఉందన్నారు. ముున్ముందు డిగ్రీ కళాశాలగా ఈ సంస్థ ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి అంజద్‌బాషా తల్లి నూర్జహాన్ బేగంతో పాటు సోదరులు, చెల్లెల్లు, బావలు, అల్లుడితో పాటు కుటుంబ సభ్యులంతా హాజరయ్యారు. జూనియర్ కళాశాలకు రెండు తరగతి గదులను నిర్మించినందుకు కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ మజ్‌హర్ అలీఖాన్ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల కమిటీ సభ్యులు కలీముద్దీన్, యాసిన్‌బాషా, కరీముల్లా, అక్బర్‌బాషా, ఎస్‌బి అహమ్మద్ ఆలీ, ప్రిన్సిపాల్ హసీనాబేగం, కార్పొరేటర్లు అక్బర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు వద్ద సొమ్మసిల్లి పడిపోయిన మహిళ

– మానవతాదృక్పథంతో బెంచ్ దిగివచ్చిన జడ్జి

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలోని మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు వద్ద శుక్రవారం కేసు వాయిదాకు వచ్చిన ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోయారు. కోర్టులో ఉదయం 10.30 గంటలకు రోజువారీ కేసుల విచారణ ప్రారంభమైంది. మూడో అదనపు జిల్లా జడ్జి వై.వీర్రాజు కేసులను పరిశీలిస్తున్నారు. ఇంతలో అదే కోర్టుకు కక్షిదారుగా వచ్చిన ఒక మహిళ హఠాత్తుగా ప్రధాన ద్వారం వద్ద సొమ్మసిల్లి పడిపోయారు. గమనించిన జడ్జి వీర్రాజు వెంటనే బెంచ్ దిగి అక్కడికి చేరుకున్నారు. ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి సహాయం అందించాలని కోర్టు సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆటోలో ఆస్పత్రికి తరలించారు. ఆమె వెళ్లిన తర్వాత న్యాయమూర్తి తిరిగి విధులకు వచ్చారు. స్థానిక మూడో అదనపు జిల్లా జడ్జి చూపిన చొరవను కక్షిదారులు, న్యాయవాదులు కొనియాడారు. మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టులోని ఓ ఎగ్జిక్యూషన్ పిటిషన్‌లో ఆమె ఫిర్యాదిగా ఉన్నట్టు తెలిసింది.

ఇరువర్గాల మధ్య ఘర్షణ


తీవ్రంగా గాయపడిన కదిరప్ప, చలపతి

రాయచోటిటౌన్ : రాయచోటి మండలం మాధవరం కాటినేనివాండ్లపల్లె సమీపంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు గాయపడ్డారు. పొలం వద్ద ఏర్పాటు చేసే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో భాగం ఇవ్వాలనే విషయంలో శుక్రవారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మెరుగు కదిరప్ప, మెరుగు వెంకటచలపతి అనే తండ్రీ కొడుకులపై చిన్నప్ప, రెడ్డిశేఖర్, వెంకటరమణలు రాళ్లు, కర్రలతో దాడిచేసి గాయపరిచారు. వీరిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కదిరప్ప పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. జరిగిన సంఘటపై రాయచోటి పోలీసులు కేసుమోదు చేశారు.

ఒకరు లోపలికి... ఇద్దరు బయటకు!

- యువగళం పాదయాత్రలో మదనపల్లె టీడీపీ దుస్థితి
- అడుగడుగునా నాయకులు, కార్యకర్తలకు అవమానాలు, అలకలు
- ఇమేజ్ పెరగకపోగా, డ్యామేజీ జరిగిందంటున్న సీనియర్ నాయకులు


పాదయాత్రలో తనకు జరిగిన అవమానంపై ధర్నా చేసేందుకు వచ్చిన కమ్మల రఘునాథ్‌ను బుజ్జగిస్తున్న టీడీపీ నాయకులు

మదనపల్లె : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతం సంగతేమో కానీ... మదనపల్లె పర్యటన మాత్రం ఆయనకు లేనిపోని తలనొప్పులు తెచ్చిపెడుతోంది. పార్టీలోకి కొత్తగా మైనారిటీ నాయకుడు వస్తున్నాడని సంబరపడేలోపు.. ప్రజాబలం ఉన్న ఓ సీనియర్ నాయకుడిని, ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న మరో ఆశావహుడిని పార్టీపై అలకపూని వెళ్లిపోయేలా చేసింది. పాదయాత్రలో పార్టీని బలోపేతం చేసి, నాయకులందరి మధ్య సఖ్యత తీసుకువచ్చి గాలి తగ్గిపోయిన సైకిల్‌ను పరుగులు తీయిస్తాడనుకుంటే ఏకంగా చక్రాలే లేకుండా చేసి వెళ్లిపోతున్నాడని సీనియర్ నాయకులు వాపోతున్నారు. మదనపల్లె నియోజకవర్గంలో పాదయాత్ర ప్రారంభం రోజున టీడీపీ ఆశావహుడు జయరామనాయుడు ఘోర పరాభవంతో అలిగి ఇంటికి వెళ్లిపోతే.. రెండోరోజు శుక్రవారం టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే శోభ భర్త రాటకొండ బాబురెడ్డి మనస్తాపంతో పాదయాత్రలో పాల్గొనకుండా వెళ్లిపోయారు. ఉదయం పట్టణంలో దేవతానగర్ క్యాంప్‌సైట్ వద్ద ఇన్‌చార్జి దొమ్మలపాటిరమేష్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ భవానీప్రసాద్ కుటుంబ సభ్యులు నారాలోకేష్‌ను కలిసేందుకు లోపలికి వెళ్లారు. అప్పుడే అక్కడికి చేరుకున్న సీనియర్ నాయకుడు రాటకొండ బాబురెడ్డి కురబ కులానికి చెందిన ప్రతినిధులు వినతిపత్రం ఇవ్వాలంటే వారిని తీసుకుని లోపలికి వెళ్లేందుకు వచ్చారు. దొమ్మలపాటిరమేష్, కుటుంబసభ్యులను లోపలకు పంపిన సెక్యూరిటీ సిబ్బంది బాబురెడ్డిని లోపలకు పంపేందుకు ససేమిరా కుదరదన్నారు. తాను సీనియర్ నాయకుడినని చెప్పినా వినకపోవడంతో ఆయన ఒకింత అసహనానికి, మనస్థాపానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి సముదాయించేందుకు ప్రయత్నిస్తే.. మీ వెనుక తిరిగితేనే మమ్మల్ని లీడర్లుగా గుర్తిస్తారా లేకపోతే గుర్తించరా.. అంటూ అక్కడి నుంచి వచ్చేశారు. ఇదిలాఉంటే మదనపల్లె పట్టణ తెలుగుయువత అధ్యక్షుడు కమ్మల రఘునాథ్ నారాలోకేష్‌ను గజమాలతో సత్కరించాలని, పెద్ద క్రేన్‌ను తెప్పించి అనిబిసెంట్ సర్కిల్‌లో గంపెడాశతో నిలబడితే.. నారా లోకేష్ గజమాలను స్వీకరించకపోగా, కలిసేందుకు వచ్చిన ఆయన ను నెట్టివేశాడు. ఒకవేళ ఆయనకు తానెవరో తెలియక నెట్టేశారేమోనని అనుకున్నా.. ఆయన పక్కనే ఉన్న ఇన్‌చార్జి దొమ్మలపాటిరమేష్ కుమారులు ఇద్దరూ పట్టించుకోకపోవడం, మాటవరుసకైనా మనవాడేనని చెప్పకపోవడంతో రఘునాథ్ అవమానానికి లోనయ్యాడు. ఆగ్రహంతో రగిలిపోతూ సుమారు 100మంది యువకులతో కలిసి లోకేష్ విడిది కేంద్రం వద్ద ధర్నా చేసేందుకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న పార్టీ పెద్దలు వారించడంతో లోలోపలే దుఃఖాన్ని దిగమింగుకుని ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. పాదయాత్రలో పాల్గొన్న సగం మందికి భోజనాలు పెట్టకపోవడంతో విడిది కేంద్రం నుంచి వెళ్లిపోయారు. దీంతో సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కావాల్సిన బహిరంగ సభ 1.30 గంట ఆలస్యంగా జనాలను బలవంతంగా తీసుకువచ్చి సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభించారు.

అమ్మా రండి..అన్నతో సెల్ఫీలు తీసుకోండి

లోకేష్‌తో ఫొటో తీయించుకోవాలంటూ మహిళలను అభ్యర్థించిన యువగళం టీం


సెల్ఫీలకు రండక్కా.. అని బతిమాలి తీసుకెళుతున్న యువగళం టీంసభ్యుడు రాకేష్


రాకేష్ తీసుకువచ్చిన మహిళలతో సెల్ఫీ దిగుతున్న నారాలోకేష్

మదనపల్లె : నారాలోకేష్ యువగళం పాదయాత్రను ఎలాగైనా విజయవంతం చేసేందుకు టీం సభ్యులు తెగ కష్టపడిపోతున్నారు. లోకేష్‌ను చూసేందుకు ప్రజలు రాకపోయినా, రోడ్డుపై ప్రజలు కనిపించకపోయినా వాళ్లు ఎక్కడుంటే అక్కడకు వెళ్లి.. 'అమ్మా రండమ్మా.. రండి.. అన్నతో సెల్ఫీలు తీసుకోండి. ప్లీజ్.. మహిళలకు మాత్రమే అవకాశం' అంటూ బతిమాలి, బామాలి.. వారికిష్టం లేకున్నా బలవంతంగా సెల్ఫీలు తీయించి పంపుతున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో శుక్రవారం నిర్వహించిన యువగళం పాదయాత్రలో నారాలోకేష్ టీంసభ్యులు రాకేష్ రోప్‌వేకు ముందు వెళుతూ మహిళలు, ప్రజలను ఇలా అభ్యర్థించడం కనిపించింది. కొందరైతే మాకెందుకయ్యా ఆ బాబుతో సెల్ఫీ అంటున్నా వినకుండా.. రండక్కా అంటూ వేడుకోవడం కనిపించింది.